రామయ్య సేవలో వికారాబాద్ కలెక్టర్

స్వామివారిని దర్శించుకున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

భద్రాచలం, జూన్ 21 : వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం కుటుంబ సమేతంగా భద్రాచలం సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉపాలయాలను సందర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అర్చకులు లక్ష్మీతాయారమ్మ వారి సన్నిధిలో ఆయనకు వేదాశీర్వచనం, స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో వారి వెంట దేవస్థానం ఈఈ రవీందర్‌రాజు, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వేద పండితులు ఎస్టీజీ కృష్ణమాచార్యులు ఉన్నారు.

రామాలయంలో జ్యేష్ఠాభిషేకానికి అంకురార్పణ

గోదావరి నుంచి తీర్థపు బిందెను తీసుకొస్తున్న అర్చకులు

భద్రాచలం, జూన్ 21 : ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని జ్యేష్ఠ మాసంలో భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం యాగశాలలో జ్యేష్ఠాభిషేకానికి అంకురార్పణ నిర్వహించారు. తొలుత పవిత్ర గోదావరి నుంచి తీర్థపు బిందెను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చారు. తర్వాత యాగశాలలో విశ్వక్సేన ఆరాధన, భగవత్ పుణ్యాహవాచన, దైవ ప్రార్థన, రక్షా బంధన, పుట్టమన్నుతో పూజ, వాస్తు హవనం, అంకురారోపణ హవనం, ద్వార తోరణ పూజ, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలతో జ్యేష్ఠాభిషేకానికి అంకురార్పణ చేశారు.

నేడు కలశవాహన..

ఏరువాక పౌర్ణమి సందర్భంగా శనివారం ఉదయం బేడా మండపంలో స్వామివారి నిత్య కల్యాణ మూర్తులకు 81 వెండి కలశాలతో కలశవాహన, దేవతావాహన జరిపిన తర్వాత స్వామి వారికి పంచ ఉపనిషత్తు మంత్రాలతో విశేష స్నపనం నిర్వహించనున్నారు. 108 లీటర్ల పాలు, అందులో సగం పెరుగు, ఆవు నెయ్యి, కండ చక్కెర, తేనెతోనూ పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. తొమ్మిది రకాల పండ్ల రసాలు, హరిద్రాచూర్ణం, గంధోదకం, సమస్త నదీ తీర్థాలు, తులసి మాలలు, సాలగ్రామాలు, అర్ఘ పాద్యాదులు, సహస్ర ధారలతో అభిషేకం నిర్వహించనున్నారు.

మద్యం తాగి పాఠశాలకు..

మత్తుతో బడి బయటే పడిపోయిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

పక్కనే పశువుల కొట్టంలోకి తీసుకెళ్లి పడుకోబెట్టిన స్థానికులు

ములకలపల్లి, జూన్ 21: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ వారికి మార్గదర్శకంగా ఉండాల్సిన ఉపాధ్యాయుడే.. వారి ముందు దారితప్పి ప్రవర్తించాడు. అందునా ఉదయమే పూటుగా మద్యం తాగి పాఠశాలకు వచ్చాడు. పూర్తిగా నిషాలో ఉన్న అతడు.. కనీసం నాలుగు అడుగులు నడిచి పాఠశాలలోకి వెళ్లేంత శక్తిలేని స్థితిలో ఉన్నాడు. పిల్లలందరూ చూస్తుండగానే స్వయంగా వారి ఎదుటే తడబడి నడిచి బడి బయటే కుప్పకూలి మత్తులోకి జారుకున్నాడు. విద్యార్థులతోపాటు గ్రామస్తులు కూడా నిశ్చేష్టులై చూసిన ఈ ఘటన భద్రాద్రి జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, విద్యార్థుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం తిమ్మంపేట పంచాయతీ రాజీవ్‌నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో రెండేళ్లుగా ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పత్తిపాటి వీరయ్య.. తరచూ మద్యం తాగి విధులకు హాజరవుతుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కూడా పూటుగా మద్యం

ములకలపల్లిలో మద్యం మత్తులో పడిపోయిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వీరయ్య

తాగి నడవలేని స్థితిలో పాఠశాల వద్దకు వచ్చాడు. పూర్తి మద్యం మత్తులో ఉన్న అతడు.. నడిచే శక్తి లేని స్థితిలో ఉండి పాఠశాల బయటే పడిపోయాడు. ఈ దృశ్యాన్ని గమనించిన స్థానికులు కొద్దిసేపటి తరువాత వచ్చారు. స్పృహలో లేని అతడిని పక్కనే ఉన్న పశువుల కొట్టంలోకి తీసుకెళ్లి చాప మీద పడుకోబెట్టారు. కాగా, రెండేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్న ఇతడు తరచూ ఇలాగే మద్యం తాగి విధులకు హాజరవుతున్నట్లు స్థానికులు చెప్పారు. గతంలో అనేకసార్లు తాము ఇతడి విషయాన్ని మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. వారు అతడిని మందలించినప్పటికీ అతడిలో మార్పు రావడం లేదని, గౌరవప్రదమైన వృత్తికి మచ్చ తెస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, మధ్యాహ్నం రెండు గంటల తరువాత స్పృహలోకి వచ్చిన ఉపాధ్యాయుడు.. అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

అప్పటికే సీఎల్ వేశాం

'ఉపాధ్యాయుడు పత్తిపాటి వీరయ్య ఐదు రోజులుగా సెలవులో ఉన్నాడు. సెలవు గడువు పూర్తి కావడంతో శుక్రవారం ఆలస్యంగా పాఠశాలకు వచ్చాడు. అప్పటికే రిజిస్టర్‌లో సీఎల్ నమోదు చేశారు. దీంతో శుక్రవారం అతడు విధుల్లో లేనట్లే. పాఠశాలకు ఆలస్యంగా వచ్చిన వీరయ్య.. ఆ తరువాత తిరిగి వెళ్లిపోయాడు.' **-కిరణ్, ఇన్‌చార్జి హెచ్ఎం**

పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీవో విద్యాచందనతో కలిసి నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, పీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ, ఈఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా 697 పాఠశాలల్లో జరుగుతున్న

మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పనులపై ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో స్టీల్‌ట్యాంక్ ఏర్పాటు చేసి దానికి సెడ్మెంట్ ఫిల్టర్ బిగించి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆదేశించారు. భోజన సమయంలో చేతులు, ప్లేట్లు కడగడానికి స్టీల్ వాష్‌బేషిన్ ఏర్పాటు చేయాలని, వాడిన నీటి కోసం ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయాలన్నారు. ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు సరైన పద్ధతిలో బిగించాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి, ఆర్‌అండ్‌బీ డీఈ నాగేశ్వరరావు, మున్సిపల్ డీఈ రవికుమార్, ట్రైబల్ వెల్ఫేర్ డీఈ, మెప్మా పీడీ రాజేష్, డీపీఎం సిర్ప్ నాగజ్యోతి, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

- పొలం వివాదమే కారణం!
- న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

కొణిజర్ల, జూన్ 21 : పొలం వివాదం కారణంగా రైతు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖమ్మంజిల్లా కొణిజర్ల మండలంలోని మేకలకుంట గ్రామంలో చోటుచేసుకుంది. బంధువులు, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్యా సక్రియ(55), లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ముగ్గురికీ వివాహాలు జరిగాయి. ప్రస్తుతం చిన్నకుమారుడు ఇంటివద్ద ఉంటున్నారు. గురువారం రాత్రి అందరూ గదిలో నిద్రిస్తుండగా సక్రియ ఇంటిపక్కన ఉన్న రేకులషెడ్డులో చీరెతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి సుమారు 11గంటల సమయంలో చూసిన భార్య కేకలు వేయడంతో కొడుకులు వచ్చి తండ్రిని కిందకు దించి వైరాలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

రగులుతున్న పొలం వివాదం!

సక్రియ తన భూమిని ముగ్గురు కొడుకులు, తనకు నాలుగు వాటాలు పంచగా ఒక్కొక్కరికీ 1.20 ఎకరాల భూమి వచ్చింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన వేముల సత్యనారాయణ, కుమారుడు అజయ్ వారి పొలం కౌలుకు చేస్తున్న బానోతు కృష్ణ, భార్య బుజ్జి ఈ నలుగురు కలిసి సక్రియ పొలానికి వెళ్లేందుకు దారిలేదని అడ్డుకోవడంతో గత మూడేళ్లుగా పొలం బీడుగానే ఉంటున్నది. వర్షాధార పంటలు వేసేందుకు సక్రియ వరద కాలువను జేసీబీతో తవ్వించగా సదరు వ్యక్తులు కాల్వను కూడా పూడ్చివేశారు. అంతేకాకుండా పొలం మాకు అమ్మండి లేదంటే మిమ్మల్ని పొలంలోకి రానివ్వమంటూ బెదిరిస్తున్నారు.

కొణిజర్ల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు

భూక్యా సక్రియ (ఫైల్)

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

సక్రియకు ప్రాణహాని ఉందని గత నెల 25వ తేదీన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు పట్టించుకోలేదని ఆగ్రహంతో మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు కొణిజర్ల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న వైరా సీఐ సాగర్‌నాయక్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో ఫిర్యాదు చేయగా ఇరుపక్షాల వారిని పిలిపించి విచారణ చేశానని ఎస్సై శంకర్‌రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. మృతుడి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు ఎస్సై శంకర్‌రావు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమ తండ్రిని మానసికంగా వేధించడంతో ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారికి అదే గ్రామానికి చెందిన తేజావత్ మదన్, చింతల మల్లయ్య మద్దతు పలుకుతున్నారు.

228 కేజీల గంజాయి పట్టివేత

పట్టుకున్న గంజాయిని, నిందితులను చూపిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

దుమ్ముగూడెం/భద్రాచలం, జూన్ 21 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎండు గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేశ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు సిబ్బందితో కలిసి ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ కారు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపేందుకు ప్రయత్నించగా.. కారులో ఉన్న వారు ఆపకుండా వెళ్తున్నారు. దీంతో దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం వద్ద కారును ఆపి తనిఖీ చేయగా.. 228.100 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.65 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. గంజాయిని తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన క్రిష్టఫర్, శివగురు, రకుల్‌బోస్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.5,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. అంతేకాక వీరి వద్ద శ్రీలంక, బంగ్లాదేశ్‌కు చెందిన కరెన్సీ పట్టుబడింది. ఎస్‌హెచ్‌వో రహీమున్నీసా బేగం కేసు నమోదు చేశారు. బాలు, సుధీర్, హరీశ్, హనుమంతరావు, విజయ్, వెంకట్ పాల్గొన్నారు.

మణుగూరులో 14 కేజీలు..

మణుగూరు టౌన్, జూన్ 21 : ద్విచక్ర వాహనంపై మణుగూరు మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్న గంజాయిని మణుగూరు పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం చిత్రకొండ ప్రాంతానికి చెందిన గురుకిల, పోదు వంతల్‌లు అదే ప్రాంతానికి చెందిన రాహుల్‌కుమార్ సూచన మేరకు 14 కిలోల గంజాయిని హైదరాబాద్‌లోని ఓ వ్యక్తికి ఇచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో రాజుపేట క్రాస్ రోడ్డు వద్ద ఎస్ఐ మేడ ప్రసాద్‌కు వీరిపై అనుమానం రావడంతో సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3.40 లక్షల విలువైన 14 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తలించామన్నారు. రాహుల్ పరారీలో ఉన్నాడని తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది షమీమ్, రవీందర్, సనయ్ తదితరులు పాల్గొన్నారు.

'చేపల పెంపకంపై దృష్టి పెట్టండి'

కూసుమంచి, జూన్ 21 : రైతులు వ్యవసాయానికి అనుబంధంగా చేపల పెంపకాన్ని చేపడితే లాభాలు వస్తాయని, మార్కెట్‌లో చేపల ఉత్పత్తులను మంచి డిమాండ్ ఉన్నదని శాస్త్రవేత్తలు శ్యాంప్రసాద్, శాంతన్న, రవీందర్ అన్నారు. పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన 25 మంది రైతులకు ఇస్తున్న శిక్షణ శుక్రవారం రెండో రోజుకు చేరింది. యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. మత్స్య పరిశ్రమను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఎన్నో రాయితీలు కల్పిస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుంటూ రైతులు మత్స్య పరిశ్రమ వైపు దృష్టి సారించాలన్నారు. అనంతరం చేపల పెంపకంపై అవగాహన కోసం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.

శిక్షణలో చేపల పెంపకంపై వివరిస్తున్న మత్స్య శాస్త్రవేత్త

పసిడి-వెండి జిగేల్

- ఒక్కరోజే రూ.810 పెరిగిన తులం బంగారం
- 1,500 ఎగిసిన కిలో వెండి రేటు

న్యూఢిల్లీ, జూన్ 21: బంగారం, వెండి ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. శుక్రవారం హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ పుత్తడి రేటు రూ.810 పుంజుకొని రూ.73,250ని చేరింది. 22 క్యారెట్ ధర రూ.750 అందుకుని రూ.67,150గా నమోదైంది. వరుసగా 4 రోజులు స్థిరంగా లేదా పడిపోతూ వచ్చిన పసిడి విలువ.. గురువారం కూడా పెరిగిన విషయం తెలిసిందే. ఇక వెండి ధర మరో రూ.1,500 ఎగబాకింది. కిలో 94,000 పలుకుతున్నది. క్రితం రోజు కూడా రూ.1,500 ఎగిసిన సంగతి విదితమే. ఢిల్లీలోనూ 24 క్యారెట్ బంగారం రూ.73,350గా, కిలో వెండి రూ.93,700గా ఉన్నది. ఈ ఒక్కరోజే రూ.800, రూ.1,400 చొప్పున ఎగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే.. కొమెక్స్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర ఒకేసారి 28 డాలర్లు పెరిగి 2,360 డాలర్లు పలికింది. ఔన్సు వెండి 30.40 డాలర్లుగా ఉన్నది.

జీఎస్టీ స్లాబులు తగ్గాలి: జీటీఆర్ఐ

న్యూఢిల్లీ, జూన్ 21: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్లాబుల సంఖ్యను తగ్గించాలని గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) కేంద్ర ప్రభుత్వానికి, జీఎస్టీ మండలికి శుక్రవారం సూచించింది. శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ 53వ సమావేశం జరుగనున్నది. ఈ క్రమంలోనే జీఎస్టీ మినహాయింపు పరిమితిని రూ.1.5 కోట్ల వార్షిక టర్నోవర్‌దాకా ఉన్న అన్ని సంస్థలకు పెంచాలని కూడా జీటీఆర్ఐ కోరింది. ప్రస్తుతం ఇది రూ.40 లక్షలుగానే ఉన్నది. పరిమితిని పెంచితే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు లబ్ధి చేకూరుతుందని, ఉద్యోగ-ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జీటీఆర్ఐ ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. ఇక రాష్ట్రాలవారీ రిజిస్ట్రేషన్లను దూరం పెట్టాలన్నది. కాగా, శనివారం భేటీలో ఆన్‌లైన్ గేమింగ్‌పై పన్ను వేయడంతోపాటు, ఎరువులపై పన్నును తగ్గించాలన్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సులపై చర్చ జరిగే వీలున్నది. ప్రస్తుతం ఎరువులపై 5 శాతం జీఎస్టీ పడుతున్నది. సల్ఫ్యూరిక్ యాసిడ్, అమ్మోనియా తదితర ముడి సరకులపై 18 శాతం వర్తిస్తున్నది. జీఎస్టీలో ఇప్పుడు 5, 12, 18, 28 శాతం స్లాబులున్న విషయం తెలిసిందే. మరోవైపు జీఎస్టీ రేటుపై హేతుబద్ధ కమిటీ ఏర్పాటైంది. బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి కన్వీనర్‌గా నియమితులయ్యారు.

యులిప్‌లు పెట్టుబడులు కావు

- బీమా రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐ

న్యూఢిల్లీ, జూన్ 21: యునిట్ లింక్డ్ బీమా ప్లాన్ల(యులిప్)ను పెట్టుబడి పథకాలుగా ప్రచారం చేయవద్దని బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ బీమా సంస్థలకు సూచించింది. యులిప్‌లను పెట్టుబడి పథకాలుగా బీమా సంస్థలు ఇటీవల కాలంలో ప్రచారం చేస్తున్నాయని, ఇది సరైనది కాదని శుక్రవారం జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. మార్కెట్-లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీలు సాంప్రదాయ ఎండోమెంట్ పాలసీల కంటే భిన్నంగా ఉన్నాయని, ఇవి రిస్క్‌లను కలిగివుంటాయని బీమా సంస్థలు ప్రత్యేకంగా పేర్కొనాలని సూచించింది. అదేవిధంగా బోనస్‌తో కూడిన ఎండోమెంట్ పాలసీల బెనిఫిట్‌లో బోనస్‌లకు గ్యారెంటీ లేదని ముందుగానే చెప్పాలని సూచించింది. అన్ని ప్రకటనలు బీమా పాలసీకి, యాన్యుటీ ప్రొడక్ట్‌కు సంబంధించినవి మాత్రమే ప్రచారం చేయాలని పేర్కొంది.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.6,959.29 కోట్ల డివిడెండ్ చెక్‌ను అందజేస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ ఎస్బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా

ఆర్థిక అసమానతలు తగ్గవు!

రాయిటర్స్ పోల్‌లో 84 శాతం ఆర్థికవేత్తల అభిప్రాయమిదే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రానున్న ఐదేండ్లలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడమే తన లక్ష్యమని లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఊదరగొట్టారు. భారత్ మెరుగైన వృద్ధిరేటుతో దూసుకుపోతున్నదని కేంద్రప్రభుత్వ ఏజెన్సీలూ గతకొంతకాలంగా ప్రచారం చేస్తున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వృద్ధి 8 శాతం వరకు ఉన్నట్టు కేంద్రం ప్రకటించింది. అయితే, ఎవరెన్ని చెప్పినప్పటికీ, దేశంలో ఆర్థిక అసమానతలు మాత్రం తగ్గే సూచనలు కనిపించడం లేదని ఆర్థిక నిపుణులు, మేధావులు తేల్చిచెప్తున్నారు. స్టాక్‌మార్కెట్ల సూచీలు, జీడీపీ వృద్ధిరేటును చూసి పేదలు, మధ్యతరగతి వర్గాలకు లాభం చేకూరుతుందని అనుకొంటే అది పొరపాటేనని చెబుతున్నారు. రానున్న ఐదేండ్ల మోదీ ప్రభుత్వ హయాంలో పేదలకు కొత్తగా ఒరగబోయేది ఏమీ ఉండబోదని స్పష్టం చేస్తున్నారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో.. ఇప్పటికీ 80 కోట్ల మందికి ఉచిత బియ్యం సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ పత్రిక 'రాయిటర్స్' సంస్థ మే 15-జూన్ 18 మధ్య నిర్వహించిన పోల్‌లో వెల్లడైంది. పోల్‌లో పాల్గొన్న మొత్తం 51 మంది ఆర్థికవేత్తల్లో .. ఏకంగా 43 మంది రానున్న ఐదేండ్లలో మోదీ హయాంలో దేశంలో ఆర్థిక అసమానతలు తగ్గే అవకాశమే లేదని, పేదల కష్టాలు తీరబోవని తేల్చిచెప్పడం గమనార్హం.



మెజారిటీ తగ్గడానికి కారణం ఇదే

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ సీట్లు రాకపోవడానికి కారణాలను కూడా ఆర్థికవేత్తలు విశ్లేషించారు. దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలు, పెచ్చరిల్లిన నిరుద్యోగమే దీనికి కారణంగా వివరించారు. 2047లోగా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తానని ప్రధాని అంటున్నారని, అయితే, నైపుణ్యం కలిగిన మానవ వనరులను పెంచడం, నిరుద్యోగాన్ని రూపుమాపడం, సమ్మిళిత వృద్ధితోనే ఇది సాధ్యమౌతుందని ఆర్థిక నిపుణులు సూచించారు. దేశ ఆర్థిక ప్రగతికి నిరుద్యోగమే పెద్ద సమస్యగా మారిందని పోల్‌లో పాల్గొన్న 90 శాతం మంది అభిప్రాయపడ్డారు.

ధనికులు మరింత సంపన్నులుగా..

ప్రస్తుత ప్రభుత్వం తీసుకొస్తున్న విధానపరమైన నిర్ణయాలతో మధ్యతరగతి వర్గాల నడ్డివిరుగుతున్నది. ఉచితాల కోసం పేదలు ప్రభుత్వంపై పూర్తిగా ఆధారపడే దుస్థితి దాపురించింది. అయితే, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, చేయూతతో ధనికులు మరింత సంపన్నులుగా మారుతున్నారు.

- సాయిబాల్‌కర్, ప్రొఫెసర్, సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సోషల్ సైన్సెస్

తగ్గిన ఫారెక్స్ నిల్వలు

ముంబై, జూన్ 21: విదేశీ మారకం నిల్వలు మళ్లీ కరిగిపోయాయి. ఈ నెల 14తో ముగిసిన వారాంతానికిగాను 2.922 బిలియన్ డాలర్లు తగ్గి 652.895 బిలియన్ డాలర్లకు చేరాయని రిజర్వు బ్యాంక్ వెల్లడించింది. అంతక్రితం వారం రికార్డు స్థాయి 655.817 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. గత వారంలో విదేశీ కరెన్సీల రూపంలో ఉన్న ఆస్తుల విలువ 2.097 బిలియన్ డాలర్లు తగ్గి 574.24 బిలియన్ డాలర్లకు చేరడం ఇందుకు కారణమని తెలిపింది. యూరో, పౌండ్, యెన్ కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురికావడం విదేశీ రిజర్వులపై ప్రతికూల ప్రభావం చూపింది. బంగారం రిజర్వులు కూడా 1.015 బిలియన్ డాలర్లు తగ్గి 55.967 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఎస్‌డీఆర్‌లు 54 మిలియన్ డాలర్లు తగ్గి 18.107 బిలియన్ డాలర్లకు పడిపోగా, ఐఎంఎఫ్ వద్ద నిల్వలు 245 మిలియన్ డాలర్లు పెరిగి 4.581 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

బడ్జెట్‌లో రోబో ట్యాక్స్?

ప్రతిపాదనను పరిశీలిస్తున్న కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 21: రాబోయే బడ్జెట్‌లో కొత్తగా 'రోబో ట్యాక్స్'ను కేంద్ర ప్రభుత్వం తీసుకురానుందా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ మేరకు ప్రతిపాదన వచ్చినట్టు తెలుస్తుండగా, దీన్ని అమల్లోకి తెచ్చే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను వచ్చే నెల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నారు. దీంతో వృద్ధిరేటు, ఉద్యోగ కల్పన, ఆర్థిక విధానాలు, పెట్టుబడులు, రుణ భారం, ఆహార ద్రవ్యోల్బణం వంటి ప్రధానాంశాలపై ఆయా రంగాల పెద్దలతో, ఆర్థిక నిపుణులతో మంత్రి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే 'రోబో ట్యాక్స్' పరిశీలన తెరపైకి వచ్చింది.

ఏమిటిది?

కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావంతో ఇటీవలికాలంలో ఉద్యోగాలు పెద్ద ఎత్తున పోతున్నాయి. బడా కార్పొరేట్ సంస్థలన్నీ మానవ శక్తికి బదులుగా రోబో ఆధారిత శక్తిపై దృష్టి సారిస్తున్న ఫలితమే ఇదంతా. దీంతో ఏఐ కారణంగా కొలువుల్ని కోల్పోయినవారిలో నైపుణ్యం పెంచేందుకు, అందుకయ్యే ఖర్చులకు నిధుల సమీకరణ కోసం ఓ ఆర్థికవేత్త నుంచి వచ్చినదే ఈ 'రోబో ట్యాక్స్' ప్రతిపాదన. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పేపర్‌కు అనుగుణంగానే దీన్ని ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. ఏఐ రాకతో లాభాలున్నా.. భారీగా ఉద్యోగాలు పోతాయని, చాలామందికి ఇది బాధాకరమని ఐఎంఎఫ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. అందుకే నైపుణ్యాభివృద్ధి, నిరుద్యోగ బీమా కవరేజీ, వేతన బీమాలతోపాటు ప్రస్తుత కార్పొరేట్ ట్యాక్స్ వ్యవస్థల్ని పునఃసమీక్షించాలని ఐఎంఎఫ్ ప్రపంచ దేశాలకు సలహా కూడా ఇచ్చింది. ఇక అభివృద్ధి చెందుతున్న ద